రేపటి నుంచి నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

నిజాంపేట్: బాచుపల్లి శ్రీ హోమ్స్ కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక, అభయ ఆంజనేయ స్వామి దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 4వ తేదీ వరకు అభయ ఆంజనేయ సహిత నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ ప్రదీప్ తాళ్లూరి శుక్రవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. 3న ఉదయం 8:30 గంటలకు శోభాయాత్ర, సాయంత్రం 4గంటలకు మూల మంత్ర హోమాలు నిర్వహిస్తారు. 4న ఉదయం 8:19 గంటలకు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, 12 గంటలకు అన్న ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు హనుమాన్ చాలీసా, భజన, స్తోత్ర పారాయణం నిర్వహిస్తారు. ఈ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షములు పొంది ప్రసాదం స్వీకరించగలరని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

దుండిగల్: నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, వివిధ కాలనీల సభ్యులు ఆయనను కలిశారు. సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. శంభీపూర్ రాజు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో జరగబోయే వివిధ శుభకార్యాల వేడుకలు, బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వాన పత్రికలను అందజేశారు.

రీసైక్లింగ్ యూనిట్‌లతో

బ్లాక్ అవుతున్న భూగర్భ డ్రైనేజీలు!

- సుభాష్‌నగర్‌లో మూసుకుపోతున్న యూజీడీ పైప్‌లైన్‌లు
- ప్రతినిత్యం గంపలబస్తీ. వెంకటాద్రినగర్‌కు ఎయిర్‌టెక్ మిషన్ రావాల్సిందే..
- నోటీసులు జారీ చేసిన జంకని వైనం



అవుట్‌లెట్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న ఎయిర్‌టెక్ మిషన్



వెంకటాద్రినగర్‌లో రోడ్డుపై పారుతున్న రసాయనాలు

జీడిమెట్ల: రీసైక్లింగ్ యూనిట్‌ల పేరుతో అనుమతులు లేకుండా నడుస్తున్న పరిశ్రమల వల్ల హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. అక్రమంగా నడుస్తున్న యూనిట్‌లపై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్, పీసీబీ అధికారులు మాత్రం రీసైక్లింగ్ యూనిట్‌ల యాజమాన్యాలు ఇచ్చే అమ్యామ్యాలు తీసుకుని మిన్నకుండిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.సుభాష్ నగర్‌లోని వెంకటాద్రినగర్, గంపలబస్తీ ప్రాంతాల్లో చాలా వరకు అనుమతులు లేని రీసైక్లింగ్ యూనిట్‌లలో రసాయన డ్రమ్ములు, కవర్లను కడిగిన నీరు భూగర్భ డ్రైనేజీల్లోకి వదులుతున్నారు. దీంతో భూగర్భ డ్రైనేజీ అవుట్‌లెట్‌లు మూసుకుపోయి ప్రతినిత్యం మురుగునీరు రోడ్లపై పారుతుంది. ఇప్పటికైనా ఇష్టం వచ్చినట్లుగా నాలాలోకి రసాయనాలను, కవర్లను డంప్ చేస్తున్న రీసైక్లింగ్‌ల యూనిట్‌లపై ఆయా విభాగాల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

భూగర్భ డ్రైనేజీలోకి కనెక్షన్‌లు!

- కొంతమంది రీసైక్లింగ్ యూనిట్‌ల యాజమాన్యాలు మురుగునీటి పారుదల అధికారుల వద్ద ఎలాంటి అనుమతులు తీసుకోకుండా రాత్రిపూట రోడ్లను తవ్వి భూగర్భ డ్రైనేజీలోకి లైన్ కలుపుకుంటున్నారు.
- ఇక అంతే గుట్టుచప్పుడు కాకుండా యూనిట్‌ల గేట్లు మూసివేసి వారి పనులు లోపల చకచక కానిచ్చేస్తూ డ్రమ్ములను కడిగిన నీటిని భూగర్భ డ్రైనేజీలోకి పారబోస్తున్నారు.

మురుగు .. రోడ్లపై పరుగు

వివిధ రీసైక్లింగ్ పరిశ్రమల నుంచి వచ్చే రసాయన కవర్లు, రసాయనాల వల్ల భూగర్భ డ్రైనేజీ అవుట్‌లెట్‌లు మూసుకుపోతున్నాయి. ప్రతిరోజు ఉదయం లైన్‌లు జామ్ కావడంతో మురుగునీరు రోడ్లపై పారుతుంది. మురుగునీటి పారుదల శాఖ సిబ్బంది ఎయిర్‌టెక్ మిషన్‌ను తీసుకువచ్చి లైన్‌లు క్లియర్ చేయించాల్సి వస్తుంది. ప్రతినిత్యం ఇది సిబ్బందికి తలనొప్పిగా మారడంతో వారు వివిధ రీసైక్లింగ్ యూనిట్‌ల యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. నోటీసులకు సమాధానం లేకుండా ఇలానే చేస్తే అనుమతులు లేని వారి లైన్‌లు మూసివేస్తామని హెచ్చరించారు.

కూన వెంకటేష్ గౌడ్ విగ్రహావిష్కరణ



వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఆభరణాలు అందజేస్తున్న కుటుంబ సభ్యులు

కుత్బుల్లాపూర్: ప్రజా నాయకుడు, వ్యాపారవేత్త కూన వెంకటేష్ గౌడ్ 68వ జయంతిని పురస్కరించుకొని వారి కుమారులు కూన శ్రవణ్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో గాజులరామారం కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అదే విధంగా స్థానికంగా ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి బంగారు తోరణాలు, అలంకరణ సామగ్రిని అందజేశారు. అదేవిధంగా కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, గౌడ సంఘం నాయకుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్,, ఎక్సైజ్ అధికారులు, చిత్తారమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వెయ్యి మంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ స్థలాన్ని కబ్జా చేసి రెండు విల్లాలు అక్రమంగా నిర్మించడంపై శుక్రవారం సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 3, బ్లాక్ నంబర్ 21, 22 వెనుక ఐరా కన్‌స్ట్రక్షన్ ప్రక్కన ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 233/15ను కబ్జా చేసి సర్వే నంబర్ 274లో పర్మిషన్ పత్రాలను చూపెడుతూ అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని తెలిపారు. నిజాంపేట్‌లో ప్రైవేట్ స్థలం పత్రాలు చూపెడుతూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం సర్వసాధారణంగా మారిందన్నారు. గతంలో సర్వే నంబర్ 90, 94లో ఇలానే చేశారని గుర్తు చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అట్టి స్థలాన్ని పరిశీలించి పనులు నిలిపివేశారన్నారు. కానీ గురువారం రాత్రి స్లాబు పనులు జరిగాయని స్థానిక ప్రజలు తెలిపారన్నారు. వెంటనే కబ్జా, అక్రమ నిర్మాణాలను తొలగించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దస్తగిరి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల షాపులను తొలగించొద్దు



రాజీవ్ గృహ కల్పలో పర్యటిస్తున్న కార్పొరేటర్ జగన్

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబంధించిన చిరు వ్యాపారుల షాపులను తొలగించొద్దని కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. శుక్రవారం రాజీవ్ గృహకల్పలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా రాజీవ్ గృహకల్ప సముదాయానికి సంబంధించిన పేదలు రాజీవ్ గృహకల్ప స్థలం సర్వే నంబర్ 348/1 లో డబ్బాలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు షాపులకు ఇబ్బంది కలుగకుండా చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణ పనులను అర్ధాంతరంగా ప్లాన్ మార్చడం సరికాదన్నారు. షాపులను తొలగించి ప్రహరీ నిర్మించే ప్రయత్నం చేయడం వల్ల పేదలు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. పనులను వెంటనే నిలిపి వేసి చిరు వ్యాపారుల షాపులను తొలగించకుండా గత ప్లాన్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నాయకులు, చిరువ్యాపారులు ధర్మారపు అంజయ్య, బాన్సువాడ వెంకటేష్, నాగభూషణం, ఇస్తారి, నర్సింహ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మహీంద్ర యూనివర్సిటీలో స్నాతకోత్సవం

సుభాష్‌నగర్: బహదూర్‌పల్లిలోని మహీంద్ర యూనివర్శిటీలో ఈ ఆదివారం నాలుగవ ఎన్యూవెల్ స్నాతకోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు బహదూర్‌పల్లిలోని మహేంద్ర టెక్నాలజీ సెంటర్‌లో ప్రారంభమయ్యే కార్యక్రమానికి డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.ప్రసాద్, మహీంద్ర యూనివర్సిటీ చాన్సిలర్ ఆనంద్ మహేంద్ర, టెక్ మహేంద్ర సీఈవో మోహిత్ జోషి తదితరులు పాల్గొననున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి ఏజీ కాలనీలోని గల ఖాళీ ప్రదేశంలో చెట్ల పొదల్లో ఓ వ్యక్తి మృతదేహం ఉన్న విషయాన్ని శుక్రవారం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని, గ్రీన్ కలర్ షర్ట్, కాఫీ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతి చెంది వారం రోజులై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ !



సంజయ్‌గాంధీనగర్ మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

రంగారెడ్డినగర్: కుంగిన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టడంలో జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ నుంచి రంగారెడ్డినగర్ బస్టాప్‌కు వెళ్లే దారిలోని మూలమలుపు వద్ద భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ ఛిద్రమైంది. ఇటీవల సంజయ్ గాంధీనగర్- జగద్గిరిగుట్ట రోడ్డులో నూతనంగా డ్రైనేజీ లైన్ వేసి సీసీ రోడ్డు వేయడంతో ఈ మార్గం ద్వారానే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. మ్యాన్‌హోల్ మూలమలుపు వద్ద ఉండటంతో రాకపోకల సమయంలో వాహనదారులు గుర్తించక అందులో టైర్లు ఇరుక్కుంటున్నాయి. దీంతో స్థానికులు మ్యాన్‌హోల్‌పై ప్రమాద సూచికగా కర్రకు అట్టముక్కను ఏర్పాటు చేశారు. ఇకనైనా అధికారులు స్పందిస్తారో? లేదో? వేచి చూడాల్సిందే.

ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న కమిటీ అధ్యక్షుడు ప్రకాష్

కుత్బుల్లాపూర్: చింతల్ పోచమ్మ ఆలయం వద్ద శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు నక్క ప్రకాష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజు కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

రంగారెడ్డినగర్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని గాంధీనగర్‌లోని నల్ల పోచమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం కన్నమ్మ, గోవిందస్వామిల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. జల్దా రాఘవులు, రాజేందర్, ఎల్లయ్య, రవి, సాయి గౌడ్, లక్ష్మీనాథ్, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, నర్సింహ, తిమ్మయ్య, నవీన్ పాల్గొన్నారు.



గాంధీనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయం వద..

పాఠశాలలో వరలక్ష్మివ్రతం



సుభాష్‌నగర్: గాజులరామారంలోని సీఎంఆర్ పాఠశాలలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి పూజల్లో పాల్గొన్నారు. వ్రతం అనంతరం విద్యార్థులకు నైవేద్యాలను అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్న మహిళా ఉపాధ్యాయులకు పసుపు, కుంకుమ అందజేశారు.